ప్రభుత్వ పాఠశాలకు ప్రొజెక్టర్, పరికరాల వితరణ

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సంభాషిస్తున్న మల్లారెడ్డి క్యాంపస్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 14: కుత్బుల్లాపూర్ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థుల అవసరాల కోసం మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజినీరింగ్ ప్రధాన కళాశాల విద్యార్థులు సంయుక్తంగా రూ.60 వేల విలువ గల ప్రొజెక్టర్‌తో పాటు పలు పరికరాలను గురువారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు చేయూతను అందించేందుకు తమ వంతు బాధ్యతగా ఆన్‌లైన్ విద్యభ్యసించేందుకు వీలుగా ప్రొజెక్టర్‌తో పాటు ఆడియో విజువల్స్ ఉపకరణాలు, స్పీకర్లు, ప్రొజెక్టర్ స్క్రీన్ అందించారు. కార్యక్రమంలో స్టేట్ కాజ్ అధ్యక్షులు కె.పవన్, అసోసియేట్ అధ్యక్షులు మహేశ్ వర్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్రువ్‌లో సంకల్ప సిద్ధి

ప్రిలిమ్స్ పాసైతే తిరిగి ఫీజు వాపస్

ఖైరతాబాద్, డిసెంబర్ 14 : ప్రిలిమ్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు 'సంకల్ప్ సిద్ధి' పేరుతో శిక్షణ ఇవ్వనున్నట్లు ధ్రువ్ ఐఏఎస్ అకాడమీ అకాడమిక్ డైరెక్టర్ శ్రేయ చంద్రాకర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోర్సుకు సంబంధించిన బ్రోచర్లను అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కృష్ణ నాగ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఏఎస్‌కు సన్నద్ధం కావాలంటే వేలాది రూపాయలు శిక్షణ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుందని, తమ సంస్థ వినూత్నంగా అభ్యర్థులకు తగిన సహకారం అందించాలన్న ఉద్దేశంతో సంకల్ప్ సిద్ధి కోర్సును రూపొందించిందన్నారు. కేవలం నామమాత్రపు ఫీజును మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన వారందరికీ ఆ ఫీజును తిరిగి ఇచ్చేస్తామన్నారు. ఇతర వివరాలకు 9100009767 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తెలుగు స్వాములపై కేరళ సర్కారు వివక్ష

- తెలంగాణ, ఏపీ సీఎంలు స్పందించాలి
- అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ

ఖైరతాబాద్/అబిడ్స్, డిసెంబర్ 14: శబరిమల దర్శనానికి వెళ్లే తెలుగు అయ్యప్పస్వాములపై అక్కడి సర్కారు వివక్ష చూపుతున్నదని అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ నాయని బుచ్చిరెడ్డి గురుస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఏటా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి వెళ్తున్న స్వాముల విషయంలో కేరళ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదన్నారు. అక్కడి ప్రభుత్వ యంత్రాంగం పరిమితికి మించి టోకెన్లు ఇచ్చి స్వాముల ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వివిధ అయ్యప్ప సంఘాలతో పాటు అన్ని రాష్ట్రాల నుంచి ఎన్నో ధార్మిక సంఘాలు స్వచ్ఛందంగా స్వాములకు మంచినీరు, ఆహారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నా.. అక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదన్నారు. వెంటనే తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు స్పందించాలని, కేరళ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపాలన్నారు. శబరిమలలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి జనవరి నెల చివరి వరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు బాలకృష్ణ గురుస్వామి, రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్‌గాంధీ గురుస్వామి పాల్గొన్నారు.

కేరళ ముఖ్యమంత్రితో మాట్లాడండి..

సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్

తెలంగాణ రాష్ట్రం నుంచి కేరళ వెళ్లిన అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కడి ముఖ్యమంత్రితో మాట్లాడి భక్తులకు సౌకర్యాలు కల్పించేలా చూడాలని గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్ కోరారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అక్కడి ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అక్కడి రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి స్వచ్ఛంద సంస్థలు అన్నప్రసాదం, మంచినీరు పంపిణీ చేసేందుకు అనుమతులు వచ్చేలా చూడాలని కోరారు. అవసరమైతే శబరిమలలో తెలంగాణ భవన్‌ను పది ఎకరాల స్థలంలో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మనసు మురికిని జ్ఞానంతో శుద్ధి చేయాలి

ఉస్మానియా వర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న వక్తలు

కవాడిగూడ, డిసెంబర్ 14: పుస్తకం మస్తకం అయితే.. గ్రంథంలో ఉన్న జ్ఞానాన్ని తెలుసుకుంటారని, మనసు మురికిని పోగొట్టాలంటే మనసును జ్ఞానంతో పరిశుద్ధం చేయాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అలాంటి జ్ఞానాన్ని గ్రంథాలు ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. దోమలగూడలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏవీ కళాశాల ఆడిటోరియంలో శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయ శతాబ్ది ఉత్సవాలు, జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ సి.నారాయణ రెడ్డి బుక్ కల్చర్ తగ్గిపోయి, లుక్కు కల్చర్ పెరిగిందన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో ప్రభుత్వం నిషేధించిన 'ద ఫస్ట్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్' అనే గ్రంథాన్ని ఉంచారని పేర్కొన్నారు. అక్షరాన్ని జ్ఞానంగా మలుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ ఎం.రాంచందర్, గంథాలయ శాఖ ప్రభుత్వ సిటీ కాలేజీ సహాయ ఆచార్యులు డాక్టర్ చేకొని రవికుమార్, తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయ శాఖా ప్రతినిధులు డాక్టర్ రాంచందర్, ఏవీ కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ గౌతమి, ఓయూ గ్రంథాలయ శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య ఎన్.లక్ష్మణ్ రావు, ఏవీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, పీజీ సెంటర్ సంచాలకులు డాక్టర్ ఎం.భగవంత్‌రెడ్డి, గ్రంథపాలకులు ఎం.రవీందర్, పి.ప్రతిభ, ఆంధ్ర విద్యాలయ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య కే. రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఓయూ సాహిత్య వేదిక ప్రపంచ వ్యాప్తం కావాలి

ఎమ్మెల్సీ, ప్రముఖ కవి గోరటి వెంకన్న

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 14: ఓయూ సాహిత్య వేదిక ప్రపంచ వ్యాప్తం కావాలని ఎమ్మెల్సీ, ప్రముఖ కవి గోరటి వెంకన్న ఆకాంక్షించారు. తెలుగు భాష, సాహిత్యాలను సమాజంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని అన్నారు. ఓయూ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కవితా దుందుభి ఆరో వార్షికోత్సవ సభను ఓయూ ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోరటి వెంకన్న, ప్రముఖ కవి నందినీ సిధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావాలను వ్యక్తం చేసేందుకు వచన కవిత చాలా అనువైన ప్రక్రియ అని అన్నారు. మనసును కదిలించే శక్తి వచన కవిత్వానికి ఉందని చెప్పారు. హృదయానికి హత్తుకునేలా వచనం రాసే ప్రతి ఒక్కరు కవే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చింతామణి పద్యాలను ప్రముఖ గాయకుడు అక్కిరాజు రామకృష్ణారావు హృద్యంగా ఆలపించారు. చింతల యామిని, రాచకొండ రమేశ్, తులసి గారి నరసింహ, శివరాత్రి సుధాకర్, రేలారే గంగ, సుక్క రామనర్సయ్య, పాటమ్మ రాంబాబు, మీసాల లక్ష్మణ్, చంద్రయ్య, ఉదయభాను, తలారి ఢాకన్న, తగుళ్ల గోపాల్, పేర్ల రాము, శరణ్య తమ తమ ప్రక్రియలలో కవిత్వాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గణేశ్, సాహిత్య వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రదర్శనకు ఏర్పాట్లు

ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్

అబిడ్స్, డిసెంబర్ 14: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జనవరి ఒకటో తేదీ నుంచి అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను నిర్వహించేందుకు గాను ఏర్పాట్లు చేపడుతున్నామని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ పేర్కొన్నారు. సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు అవసరమైన అనుమతులు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ఇంకా పదహారు రోజులు మిగిలి ఉండటంతో స్టాళ్ల కేటాయింపు ప్రక్రియను చేపడుతున్నామని, మైదానంలో దాదాపు 2400 స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా, ఇప్పటికే స్టాళ్ల కోసం దాదాపు మూడు వేల వరకు దరఖాస్తులు అందాయని వివరించారు. ఫుడ్, అమ్యూజ్‌మెంట్ పార్క్‌లతో పాటు అన్ని రకాల స్టాళ్ల ఏర్పాటుకు గాను దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని, ప్రదర్శన పకడ్బందీగా నిర్వహించేందుకు గాను సొసైటీ సభ్యులతో ఇప్పటికే 30 సబ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మూడు ప్రవేశ మార్గాల ద్వారా సందర్శకులను ఎగ్జిబిషన్‌లోనికి అనుమతించడం జరుగుతుందని, ఎగ్జిబిషన్ నిర్వహణ సందర్భంగా అవసరమైన అన్ని భద్రతా చర్యలను చేపడుతున్నామన్నారు. పోలీస్ శాఖతో పాటు సొసైటీకి చెందిన వాచ్ అండ్ వార్డ్, వాలంటీర్లు, అంతర్గత భద్రతా చర్యలు చేపడుతున్నామని, అంతే కాకుండా సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 25 లక్షల పైచిలుకు సందర్శకులు సందర్శించే అవకాశాలున్నాయన్నారు. ఎగ్జిబిషన్ సందర్శనకు రూ.40ల ప్రవేశ రుసుమని పేర్కొన్నారు.



మియాపూర్‌లో శ్రీముఖి..

సిటీబ్యూరో, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): నగరంలోని మియాపూర్‌లో నెయిల్స్ ఎన్ బియాండ్-నేచురల్ బ్యూటీ అకాడమీ ఫ్లాగ్‌షిప్ సెంటర్‌ను ప్రముఖ యాంకర్ శ్రీముఖి ప్రారంభించి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అందం ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తోందన్నారు. ఒకప్పుడు స్కిన్‌కు మాత్రమే ప్రాధాన్యతనిచ్చేవారని ఇప్పుడు నెయిల్స్ లాంటి వాటికి కూడా అత్యంత ప్రాధాన్యతనిచ్చే ధోరణి పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ సీకే కుమార్‌వెల్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో సుమ సందడి

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నగరంలోని ఓ చేనేత వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో ప్రముఖ యాంకర్ సుమ కనకాల సందడి చేశారు. పలు చేనేత, సిల్క్ వస్త్రాలతో సెల్ఫీలకు పోజులిచ్చారు. కూకట్‌పల్లిలో ప్రారంభమైన ఈ వస్త్ర దుకాణంలో విభిన్న రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.